నేటి నుంచి ఇంటర్ పరీక్షలు షురూ



ఇంటర్మీడియట్ పరీక్షలకు సిద్ధమైన కూకట్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాల

బాలానగర్: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. మార్చి 14వ తేదీ ద్వితీయ సంవత్సరం చివరి పరీక్ష, మొదటి సంవత్సరం 13వ తేదీ వరకు ఉంటుంది. మొదటి సంవత్సరం పరీక్షలకు కూకట్‌పల్లి కళాశాలలో 759 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు కళాశాల ఉపాధ్యాయులు తెలిపారు. కూకట్‌పల్లిలో మొత్తం 29 సెంటర్లు ఉన్నాయి.

◆ ప్రశ్న పత్రాలను కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు. పరీక్ష హాలులోకి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్ష కేంద్రంలోకి పంపించమని ఉపాధ్యాయులు తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉండగా ఒక గంట ముందుగా అంటే 8 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తామని తెలిపారు. ప్యాడ్, హాల్ టికెట్ తప్ప మరేమీ లోపలకు అనుమతించరని, ఎలక్ట్రానిక్స్ వస్తువులు,



సెల్ ఫోన్స్, బ్యాగులు అనుమతించమని ఉపాధ్యాయులు తెలిపారు.

◆ కూకట్‌పల్లిలో నిత్యం ట్రాఫిక్ రద్దీగా ఉంటుంది కాబట్టి విద్యార్థులు ఒక గంట ముందే పరీక్ష హాలు వరకు చేరుకోవటం మంచిదని తెలిపారు. ఉదయం సమయంలో ఉద్యోగులు, పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు హడావుడిగా వెళుతుండటంతో కూకట్‌పల్లి ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ట్రాఫిక్ దృష్ట్యా ముందే చేరుకోవటం మంచిదని పేర్కొంటున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు మధ్యలో మ్యాన్‌హోల్



మూసాపేట: కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమీపంలో సర్వీస్ రోడ్డుపై మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు మధ్యలో ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మ్యాన్‌హోల్ కనిపించడానికి చుట్టు రాళ్లు ఏర్పాటు చేశారు. కానీ రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

చెరువుల కబ్జాపై ఉపేక్షించేది లేదు

నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్



చెరువును పరిశీలిస్తున్న నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండిరమేష్, నాయకులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఉన్న చెరువులను సుందరీకరణ పేరుతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని నాయకులు కబ్జాలు చేసి అమ్ముకున్నారని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్ ఆధ్వర్యంలో హస్మత్‌పేట బోయిన్‌చెరువును టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు నాయకులతో కలసి పరిశీలించారు. చెరువు చుట్టూ వెలసిన అక్రమ లేఅవుట్లు, చెరువు బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లో వెలిసిన అక్రమ నిర్మాణాలను చూసి అవాక్కయ్యారు.

ఆర్డర్ ఉన్నా కూల్చరా..?

హస్మత్‌పేట విలేజ్ సర్వే నంబర్ 1, 15, అండ్ 17 బోయిన్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ను కబ్జా చేసిన లేఅవుట్‌లోని నిర్మాణాలను కూల్చివేయాలని రెండేళ్ల క్రితం బాలానగర్ మండలాధికారులు, జీహెచ్‌ఎంసీ, పోలీసు బందోబస్తు అడిగిన ఇప్పటి వరకు పోలీసులు ప్రొటెక్షన్ ఇవ్వకపోవడంలో అంతర్యాం ఎంటని బండి రమేష్ ప్రశ్నించారు. చెరువులను కాపడటంతో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల అక్రమణ, చెరువు చుట్టూ పక్కాల అక్రమ భవనాల నిర్మాణాలను అడ్డుకుని చెరువులను పరిరక్షిస్తామని అన్నారు. తాము పరిశీలించిన చెరువు దుస్థితిపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులతో పాటు ఏ బ్లాక్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి, నల్లోల రాజేందర్, షాయిన్‌షా, అస్లాం, రఘు, కొప్పిశెట్టి దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను అడ్డుకోబోయి..

పంజగుట్ట: మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ ముందు ఓ యువకుడు మంగళవారం హల్‌చల్ చేశాడు. మంత్రి సీతక్క బయటకు వెళ్తుండగా ఆమెను ఆపేందుకు యత్నించాడు. వెంటనే స్పందించిన పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. ప్రజాభవన్‌లో జరుగుతున్న ప్రజాదర్బార్‌కు మల్లాపూర్‌కు చెందిన యువకుడు యోహాన్‌సిరిమల్ల దరఖాస్తు పేపర్లతో వచ్చాడు. అదే సమయంలో మంత్రి సీతక్క కారులో ఆమె ప్రజాభవన్‌లోని తన ఇంటి నుంచి బయటకు వస్తుండగా యోహాన్ ఒక్కసారిగా సీతక్కా.. అంటూ అరిచాడు. ఆమె కారు ఆపగానే ఘట్‌కేసర్ మండలం నారపల్లికి చెందిన దాసమ్మ.. మంత్రి కాళ్లపై పడి 'తనకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. తన కుమారునికి ఉద్యోగం, డబుల్‌బెడ్‌రూం ఇల్లు కావాలి' అని అడిగింది. అంతలోనే యోహాన్ వేగంగా సీతక్క వద్దకు వెళ్లేందుకు యత్నించాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కాగా, నిందితుడు పొంతనలేకుండా మాట్లాడుతున్నాడని పోలీసులు తెలిపారు.

విప్లవవీరుడు చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళి



చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గూడెపు నాగరాజు తదితరులు

కూకట్‌పల్లి: విప్లవవీరుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిర్వహించారు.కేపీహెచ్‌బీ 5వ ఫేజులో జరిగిన కార్యక్రమంలో జనసేన కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పాల్గొని చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విప్లవవీరుడు, మహనీయుడు ఉద్యమకారుల్లో గొప్పవాడు చంద్రశేఖర్ ఆజాద్ అని కొనియాడారు. నా చావు నా చేతుల్లో ఉంది, శత్రువుల చేతుల్లో లేదని తనకు తాను దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భరతమాత వీర పుత్రుడు చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి జనసేన పార్టీ కోఆర్డినేటర్ కొల్లా శంకర్, వేముల మహేష్, డివిజన్ అధ్యక్షుడు కె. ప్రసాద్, సాలాది శంకర్, జెమిని సునీల్, వెంకటేశ్వరరావు, మారుతి, శేఖర్, మధుసూదన్ రెడ్డి, వీర మహిళలు లక్ష్మీ, శ్యామలా దేవి తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి బస్టాప్‌లో...

చంద్రశేఖర్ ఆజాద్ 93వ వర్ధంతిని పురస్కరించుకొని కూకట్‌పల్లి బస్టాప్ వద్ద ఆయన విగ్రహానికి మంగళవారం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గూడెపు నాగరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది స్వాతంత్ర్య సమరయోధులన తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. వీరి ప్రాణ త్యాగాల వల్లనే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి జిట్ట సునీల్ కుమార్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాచమల్ల శేఖర్ గౌడ్, పాండు ముదిరాజ్, సిహెచ్. రాజు యాదవ్, అనిల్ గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు ఉదయ్‌గౌడ్, సాయికుమార్, గణేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అద్దెలు రాక.. జీతాలు అందక.!

- అవస్థలు పడుతున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు
- అద్దె భవనాల్లోనే జిల్లాలోని 793 కేంద్రాల్లో 443 కేంద్రాలు
- 117 కేంద్రాల్లో నీటి కొరత.. మరుగుదొడ్లు లేనివి 118
- అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు.. గర్భిణులకు తప్పని పాట్లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: అంగన్‌వాడీ కేంద్రాల్లో పసిపిల్లలు, గర్భిణులు, బాలింతలను పలు సమస్యలు కలవర పెడుతున్నాయి. పలు కేంద్రాల్లో ప్రధానమైన తాగునీరు, మరుగుదొడ్లు, కరెంటు సమస్య వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. అద్దె భవనాలకు అద్దె డబ్బులు చెల్లించకపోవడం ఒకవంతు అయితే.. సొంత భవనాలున్న కేంద్రాలకు కూడా సరైన వసతులు కల్పించలేని పరిస్థితి నెలకొంది. అలాగే, అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్న టీచర్లు, ఆయాల(హెల్పర్లు)కు కూడా నెలనెలా జీతాలు అందించలేకపోతున్నారు. ఇవన్నీ సంబంధిత శాఖ అధికారులకు తెలిసినప్పటికీ.. ఏ మాత్రం చొరవ చూపడం లేదని తెలుస్తోంది.

793 కేంద్రాల్లో 1.07 లక్షల మంది

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఇందులో ఆరు నెలల నుంచి ఆరేండ్ల పిల్లలు 90.361 మంది, గర్భిణులు, బాలింతలు 17,123 మంది ఉండగా, మొత్తంగా 1,07,484 మంది ఉన్నారు. ఇందులో కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 కేంద్రాలు ఉండగా, 47.028 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు, మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాల్లో 39,463 మంది, అల్వాల్ పరిధిలో 271 అంగన్‌వాడీ కేంద్రాల్లో 20,993 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

సొంత భవనాలు లేనివి 443

జిల్లాలోని 793 అంగన్‌వాడీ కేంద్రాల్లో 212 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. ఇవి కాకుండా దాతలు ఉచితంగా ఇచ్చిన 138 భవనాల్లో కూడా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మిగిలిన 443 అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అత్యధికంగా 277 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అల్వాల్‌లో 271 కేంద్రాల్లో 143 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాలకు గానూ 23 మాత్రమే అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

117 కేంద్రాల్లో నీటి కటకట

జిల్లాలోని 793 అంగన్‌వాడీ కేంద్రాల్లో 117 కేంద్రాల్లో తాగునీరు తదితర సౌకర్యాలు లేవు. ఇందులో మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 211 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఇందులో అత్యధికంగా 77 కేంద్రాల్లో తాగునీరు లేదు. అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 40 కేంద్రాల్లో నీటి సమస్య ఉంది.

మరుగుదొడ్లు అంతే..

జిల్లాలోని మొత్తం 793 అంగన్‌వాడీ కేంద్రాలకు గానూ 118 అంగన్‌వాడీ కేంద్రాలోలే మరుగుదొడ్లు లేవు. ఇందులో మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 78, అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 51, కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 40 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు లేవు. అలాగే అద్దె భవనాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఇచ్చే అద్దె చాలా తక్కువ కావడంతో టాయ్‌లెట్ కట్టించి ఇచ్చే పరిస్థితి లేదు.

6నెలల అద్దెలు.. 3నెలల జీతాలు రాక..

మేడ్చల్ జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 443 కేంద్రాలు అద్దె భవనాల్లో మనుగడ సాగిస్తున్నాయి. ఈ అద్దె భవనాలకు ఆరు నెలలుగా అద్దె డబ్బులు చెల్లించకపోవడంతో టీచర్లు, ఆయాలు ఇంటి యాజమానుల నుంచి తీవ్ర వేధింపులు ఎదుర్కొంటున్నారు. అలాగే, 793 అంగన్‌వాడీ టీచర్లకు గానూ 751 మంది మాత్రమే పని చేస్తున్నారు. మిగతా 42 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే, 779 ఆయా పోస్టులకు గానూ 741 మంది మాత్రమే పని చేస్తున్నారు. మిగతా 38 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంగన్‌వాడీల్లో ఖాళీలు సంగతి అటుంచితే.. ప్రస్తుతం పని చేస్తున్న 751 మంది టీచర్లు, 741 మంది ఆయాల(హెల్పర్లు)కు మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

శుభాకాంక్షలు

కూకట్‌పల్లి: అల్లాపూర్ డివిజన్ గణేష్‌నగర్‌కు అధ్యక్షుడుగా ఎన్నికైన పన్నాల రాజశేఖర్ రెడ్డి, సభ్యులు మంగళవారం వివేకానందనగర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ నగర్‌కు నూతనంగా ఎన్నికైన రాజశేఖర్ రెడ్డిని, సభ్యులను ఆయన శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

త్వరలో అందుబాటులోకి పాఠశాల పై అంతస్తు

కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్: బాలానగర్ డివిజన్ ఫిరోజ్‌గూడలో ప్రారంభానికి సిద్ధమవుతున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల పై అంతస్తు భవనాన్ని మంగళవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ మొహమ్మద్ రషీద్, హెచ్‌ఎం శాంతమ్మ, నాయకులు శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మనూలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

రాయదుర్గం: ప్రతి ఇజమ్ అనేది తాత్కాలికమే అని, వయస్సును బట్టి మార్పులు ఉంటాయని మనూ వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'ఇస్లామిక్ స్టడీస్ ఇన్ ది మాడ్రన్ అండ్ పోస్ట్ మాడ్రన్ ఎరా– యాన్ అసెస్‌మెంట్ ఆఫ్ ఇండియన్ అండ్ ఇరానియన్ స్కాలర్స్' అనే అంశంపై ఇస్లామిక్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు మహ్మద్ ఇషాక్, మహ్మద్, ఫరీదా సిద్దిఖీ, మహ్మద్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో రూ.17 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: టెలిగ్రామ్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో ఓ మహిళను మోసం చేశారు సైబర్ కేటుగాళ్లు. సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ మహిళకు పార్ట్‌టైమ్ జాబ్ అంటూ టెలిగ్రామ్, వాట్సప్‌లలో సందేశం వచ్చింది. ఆ లింక్ ఓపెన్ చేయగా ఆమెను ఓ వాట్సప్ గ్రూప్‌లో యాడ్ చేశారు. అందులో వివిధ రెస్టారెంట్ల కోసం, గూగుల్ మ్యాప్స్‌కి రేటింగ్స్ ఇస్తూ ఇంటి వద్దే ఉంటూ డబ్బు సంపాదించవచ్చని నమ్మించారు. ఈ విధంగా పోస్ట్ ప్రీపెయిడ్ టాస్క్‌లు ఇచ్చారు. వివిధ కారణాలు చెబుతూ విడతల వారీగా ఆమె నుంచి మొత్తం రూ.17,50,000 కాజేశారు. అనంతరం వారు స్పందిచకపోవడంతో బాధితురాలు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపారు.

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

హిమాయత్‌నగర్: డివిజన్ పరిధిలోని కళ్యాణలక్ష్మి పథకం లబ్దిదారులకు కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ మంగళవారం చెక్కులు పంపిణీ చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు ఇందిరానగర్ బస్తీకి చెందిన లలిత, పప్పి బాయిలకు ఈ చెక్కులను డివిజన్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్, మహేశ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట, కమ్యూనిటీహాల్‌లో నీలిమ ఆస్పత్రి వారి సహకారంతో మంగళవారం ఉచిత డయాబెటిస్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ నవీన్ చంద్రారెడ్డి పర్యవేక్షణలో సుమారు 200 మందికి ఉచిత డయాబెటిస్ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. మహిళలకు డాక్టర్ వై. అనుపమ పర్యవేక్షణలో మహిళలకు సంబంధించిన వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మహిళలు గర్భిణీ సమయంలో పౌష్టికాహారం తీసుకున్నట్లయితే పుట్టబోయే బిడ్డ దృడంగా జన్మిస్తాడని వైద్యురాలు వై.అనుపమ



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, వైద్యులు శ్రీతేజ, స్థానిక నాయకులు సత్యనారాయణస్వామి, గార్లపాటి వెంకట్‌రెడ్డి, ఎస్.ఐలయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



ఆల్విన్‌కాలనీ: చలో చేవెళ్ల బహిరంగ సభకు శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ నాయకత్వంలో మంగళవారం వివేకానందనగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించబోతున్న ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి, కంటెస్టెడ్ కార్పొరేటర్ బాషిపాక నాగమణి, సీనియర్ నాయకులు వెంకటస్వామిసాగర్, పరశురాములు, సంగీ విజయ, డాన్ వెంకట్, రమేష్, భూషయ్య, యాకయ్య, రాజు, మల్లేష్, ఆర్.లక్ష్మి, మాధవి తదితరులు తరలి వెళ్లారు.

'రియల్‌టైమ్ సిమ్యులేషన్స్ ఆఫ్ ఎలక్ట్రికల్ సిస్టమ్'పై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వీసీ డా.కట్టా నర్సింహారెడ్డి, ప్రొఫెసర్లు

బాలానగర్: జేఎన్‌టీయూలో 'రియల్ టైమ్ సిమ్యులేషన్స్ ఆఫ్ ఎలక్ట్రికల్ సిస్టమ్'అనే అంశంపై మంగళవారం రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈఈఈ డిపార్టుమెంట్, ఒపల్ ఆర్‌టీటెక్ ప్రైవేట్ లిమిటెడ్ బెంగుళూరు ఆధ్వర్యంలో ప్రొఫెసర్ యాదయ్య 30 సంవత్సరాలు సర్వీస్ చేసి ఈనెల 29న పదవీ విరమణ పొందనున్న సందర్భంగా ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ డా. కట్టా నర్సింహారెడ్డి, రెక్టార్ డా. విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డా. జీవి నర్సింహారెడ్డి, సన్మాన గ్రహీత ప్రొఫెసర్ యాదయ్యలు పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా వీసీ డా. కట్టా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న కరెంటు అవసరాలు, పెరుగుతున్న వినియోగం, కరెంటు చార్జీలు ఇలా మనం ఇంట్లో, బయటా కరెంటు మీద ఆదార పడ్డామన్నారు. నేటి యువత పెరుగుతున్న అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్త ప్రయోగాలు, ఆవిష్కరణలు చేసి కరెంటు డిమాండ్ తగ్గేలా చూడాలన్నారు. ఇటువంటి వర్క్‌షాప్ ద్వారా అనేక నూతన అంశాలు బయటకు రావటం సంతోషించదగ్గ విషయమన్నారు. కొత్త ఆవిష్కరణల ద్వారానే తక్కువ ఖర్చుతో కరెంటును ఉత్పత్తి చేసుకొని మన అవసరం తీర్చుకోగలం అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డా. కె. భాస్కర్‌వందన సమర్పణ చేశారు.

నకిలీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లతో వేధింపులు

హిమాయత్‌నగర్: సోషల్ మీడియా వేదికగా ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ అకౌంట్లను సృష్టించి యువతులను, మహిళలను, బాలికను వేధిస్తున్న వ్యక్తిపై నగర సైబర్ క్రైమ్ పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ బాలికకు ఢిల్లీకి చెందిన వ్యక్తి(29) ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫ్రెండ్ రెక్వెస్ట్ పంపించాడు. అనంతరం వాట్సప్ నంబర్ తీసుకుని చాట్ చేశాడు. ఈక్రమంలో బాలికకు చెందిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్ నుంచి సేకరించి వాటిని మార్ఫింగ్ చేశాడు. తాను చెప్పిన విధంగా డబ్బులు ఇవ్వాలని, మొబైల్ ఫోన్‌కు రీచార్జ్ చేయాలని బ్లాక్‌మెయిల్ చేశాడు. లేదంటే ఆ ఫొటోలను సోషల్ మీడియాతో పాటు బంధువులు, స్నేహితులకు పంపిస్తానని వేధించాడు. దీంతో గతంలోనే బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మోతీనగర్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యుడు శ్రీరామ్మూర్తి మృతి



మోతీనగర్: మోతీనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సీనియర్ సభ్యుడు పుచ్చ శ్రీరామ్మూర్తి (85) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మోతీనగర్ ఎక్స్‌టెన్షన్‌లో ఆయన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయన యూఫామ్ కంపెనీలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన తర్వాత పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయన ఎంసీహెచ్‌ఎస్ ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. అంతేకాకుండా ఆయన చమత్కార భాషి, రచయిత, గాయకుడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతి మోతీనగర్‌కే కాకుండా ఎంసీహెచ్‌ఎస్ సొసైటీకి తీరని లోటు అని మాజీ అధ్యక్షుడు నలమాల్పు అంజిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం మోతీనగర్ జంక్షన్‌లోని ఆయన నివాసం నుంచి అంతిమ యాత్ర ప్రారంభమై హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన వారితో బండి రమేష్ తదితరులు

బాలానగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు హాజీ పాషా, మరో పదిమంది బీఆర్‌ఎస్ మైనార్టీ మహిళలు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ సమక్షంలో మంగళవారం పార్టీలో చేరారు. వీరికి బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీలో కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, ఎండీ జమీర్, ఎండీ అబ్దుల్లా, వాహిద్, జనరల్ సెక్రటరీ నజీర్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు సెంటర్‌ను ఏర్పాటు



ఓటరు నమోదు సెంటర్‌ను ప్రారంభిస్తున్న బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నె ప్రకాశ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓటరు నమోదు చేసుకుని వారికి ఓటర్ నమోదు చేసుకునేలా సెంటర్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నె ప్రకాశ్ తెలిపారు. మంగళవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లోని అంజయ్యనగర్‌లో బీజేవైఎం నాయకులు ఏర్పాటు చేసిన ఓటరు నమోదు సెంటర్‌ను కన్నె ప్రకాశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు అనేది వజ్రాయుధం లాంటిదని అర్హులైన వారందరూ ఓటు హక్కు కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఈ సెంటర్‌ను ప్రారంభించామని తెలిపారు. అందులో 18 ఏళ్లు నిండిన వారు ఓటరు రిజిస్ట్రేషన్, ఓటరు అడ్రస్ మార్పిడి, ఓటరు కార్డులో తప్పులను సరి చేయడం వంటివి ఈ సెంటర్‌లో చేస్తారని ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

ఎల్లమ్మ చెరువులో మురుగు కలవకుండా చూస్తాం



ఎల్లమ్మ చెరువులో గుర్రపుడెక్కను తొలగిస్తున్న సిబ్బంది

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని ఎల్లమ్మ చెరువు పరిసర ప్రాంత కాలనీల ప్రజలు దోమల బెడద ఎక్కువగా ఉందని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం ఎంటమాలజీ సిబ్బందితో కలిసి చెరువు పరిసరాలను పరిశీలించి పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగింపచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురుగు చెరువులో కలవకుండా రూ.2.5కోట్లతో పైపులైన్ పనులు చేపట్టామన్నారు. దీంతో దోమల బెడద, దుర్వాసన సమస్య ఉండదన్నారు. చెత్తను నాలాల్లో, చెరువుల్లో వేయొద్దని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, శివరాజ్‌గౌడ్, రాజిరెడ్డి, పాండు, వాసుదేవరావు, ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహులు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ వాటర్ ప్లాంట్‌ల ధ్వంసం



కాముని చెరువు సమీపంలో అక్రమంగా నిర్మించిన నీటి ప్లాంట్లను ధ్వంసం చేసి జీహెచ్‌ఎంసీ అధికారులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ కాముని చెరువు నుంచి అక్రమంగా నీటిని సరఫరా చేస్తున్న వాటర్‌ప్లాంట్లను మంగళవారం కూకట్‌పల్లి తహసీల్దార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కామునిచెరువు సమీపములో వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేసి చెరువు నుంచి అక్రమంగా నీటిని సరఫరా చేసి ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తున్న మూడు ప్లాంట్లను జేసీబీతో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జె.స్వామి మాట్లాడుతూ.. అక్రమంగా నీటిని వ్యాపారం చేసే ఎంతటి వారినైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాల్టా చట్టం నిబంధన ప్రకారం నీటి వ్యాపారం చేస్తే దాడులు తప్పవని హెచ్చరించారు. దాడులలో మూసాపేట సర్కిల్ డిసి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

దర్గా కాంపౌండ్ వాల్ పనులు పూర్తి

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని శోభన కాలనీల మార్కెట్ వద్ద ఉన్న అరబ్ షా బాబా దర్గాకు రూ.30లక్షల వ్యయంతో కాంపౌండ్ వాల్ పనులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌ను అరబ్ షా బాబా కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... ఇంత అద్భుతమైన పనిని ఇంత వరకు చరిత్రలో ఎప్పుడు చేయలేదన్నారు. రూ.70 లక్షల వ్యయంతో నాలా రిటర్నింగ్ వాల్ పనులను ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ సలావుద్దీన్, మొహమ్మద్ నషఖాన్, షేక్‌సమద్, అబ్దుల్‌రజాక్, ఇక్ర మొదిన్, హఫీజ్ వసీల్, మొహమ్మద్ రియాజ్, ఫిరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

